
ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
11-10-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 37 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి





# రతన్ టాటాకు ఘన నివాళి

...మిగతాది 2 లో

**జయభేరి, ముంబై, అక్టోబరు 10:**

ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, టాటా సన్స్ సంస్థ గౌరవ చైర్మన్ రతన్ టాటాపార్థీవ దేహానికి ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. ముంబయి లోని ఎన్‌సీపీఏ గ్రౌండ్‌లోని రతన్ టాటా భౌతిక కాయం ఎదుట పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌తో పాటు, గ్రూప్ ఉన్నతాధికారులు, టాటా కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రతన్ టాటా లాంటి మహోన్నత వ్యక్తి ఈ లోకాన్ని వీడిపోవడం తీరని లోటని అన్నారుప్రజల సందర్శనార్థం రతన్ టాటా పార్థీవ దేహాన్ని ముంబయి లోని NCPA గ్రౌండ్‌లో ఉంచగా.. అనంతరం ఆయన అంతిమయాత్ర ప్రారంభమైంది. గ్రౌండ్ నుంచి వర్లీ వరకూ యాత్ర సాగనుంది. వర్లీ శ్మశానవాటికలో అధికారిక లాంఛనాలతో రతన్ టాటా పార్థీవ దేహానికి అంత్యక్రియలు జరగనున్నాయి. కడసారి ఆ మహనీయుణ్ని చూసేందుకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. రతన్ టాటా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అటు, కేంద్ర ప్రభుత్వం తరఫున కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంత్యక్రియలకు హాజరయ్యారు.గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా (86) ముంబైలో బుధవారం తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల కిందట ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆయనకు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. వైద్యుల ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆయన కన్నుమూశారు. ఆయన మరణంపై ప్రముఖులు సంతాపం తెలిపారు. టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఆయన మరణంపై భావోద్వేగ లేఖ రాశారు.1937 డిసెంబర్ 28న రతన్ టాటా.. నావల్ టాటా సోనీ టాటా దంపతులకు జన్మించారు. 1991లో టాటా గ్రూపు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి రతన్ టాటా సంస్థను ఎన్నో రెట్లు అభివృద్ధి చేశారు. 2 దశాబ్దాల అనంతరం 2012లో టాటా గ్రూప్ ఛైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. 1996లో టెలికమ్యూనికేషన్స్ కోసం టాటా టెలీ సర్వీసెస్‌ని స్థాపించగా, 2004లో ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS)గా రూపాంతరం చెందింది. 2016 అక్టోబర్

...మిగతాది 2 లో

## భారత్ రత్న ఇవ్వండి

ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతితో యావత్ దేశం దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన అంత్యక్రియను కేంద్రం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ రాష్ట్ర ప్రభత్వాలు గురువారం రోజును సంతాప దినంగా ప్రకటించాయి. ప్రపంచస్థాయి వ్యాపార దిగ్గజంగా ఎదగడమే కాకుండా మానవతా వాదిగా దేశానికి సేవ చేసిన రతన్ టాటాకు భారత రత్న ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం తీర్మానించింది. ఆయన సేవలకు సరైన గుర్తింపు ఇదేనంటూ మహారాష్ట్ర మంత్రిమండలి తీర్మానం చేసింది. ముందుగా ఆయన మృతికి మంత్రిమండలి సంతాపం తెలియజేసింది. అనంతరం ఆయనకు భారత రత్న ఇవ్వాలనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. దీన్ని కేంద్రానికి పంపనుంది. వ్యాపార వేత్త కాకుండా సమాజ సంక్షేమాన్ని కాంక్షించే వ్యక్తిగా రతన్ టాటాను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని తీర్మానంలో పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారానే దేశాభివృద్ధిలో భాగమవ్వడమే కాకుండా దేశ భక్తిని చాటి చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి అంటూ కితాబు ఇచ్చింది. సమాజం చిత్తశుద్ధి ప్రజల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని వ్యాపారం చేసిన పారిశ్రామికవేత్తగా అభివర్ణించింది. సమాన ఆలోచనలు కలిగిన సామాజిక కార్యకర్త, దూరదృష్టి గల లీడర్‌ను కోల్పోయామని మహారాష్ట్రమంత్రిమండలి పేర్కొంది. భారతదేశంలోని పారిశ్రామిక రంగంలోనే కాకుండా, సామాజిక అభివృద్ధిలో కూడా టాటా సహకారం అసాధారణమైనదని అన్నారు. భారతమాత అక్కున చేర్చుకున్న మహారాష్ట బిడ్డ స్వీయ క్రమశిక్షణ, స్వచ్ఛమైన అడ్మినిస్ట్రేషన్, ఉన్నత నైతిక విలువలు కలిగిన వ్యక్తిగా ప్రజల మనిషిగా ఉన్నారని తెలిపింది. కఠినమైన పరీక్షల ఎన్ని ఎదురైనా వాటిని చిరునవ్వుతోనే అధిగమించి టాటా సంస్థలను అంతర్జాతీయంగా తీర్చిదిద్దారని కీర్తించారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెట్ జీ టాటాకి ముని మనవడు రతన్ టాటా. టాటా గ్రూప్‌కు చైర్మన్‌గా, తాత్కాలిక చైర్మన్‌గా పని చేశారు. టాటా గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్‌కు అధిపతిగా ఉంటూ కష్టాల్లో దేశానికి దేశ ప్రజలకు అండగా నిలబడ్డారు. రతన్ టాటా పాటించిన విలువలు, సంస్థలను నడిపిన తీరు భావితరాలకు పాఠంలా ఉపయోగపడుతుంది. దేశ పునర్నిర్మాణంలో టాటా గ్రూప్ కీలక పాత్ర పోషించింది. అందులో రతన్ టాటా కృషి దేశం ఎప్పటికీ మర్చిపోదు.దేశంలోన కాదు అంతర్జాతీయంగా కూడా భారతదేశ పతాకాన్ని ఎగురవేశారు. ఉప్పు నుంచి ఉక్కు వరకు కంప్యూటర్ల నుంచి కాఫీటీ వరకు టాటా పేరును ప్రతి ఇంటికీ తీసుకెళ్లారు. విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా రంగంలో కూడా విశిష్టమైన సేవ చేశారు. ముంబైపై 26/11 దాడుల తర్వాత అతని చూపిన దృఢత్వం, కోవిడ్ టైంలో ప్రధాని సహాయ నిధికి అందించిన రూ.1500 కోట్లు విరాళం ఇలా చెప్పుకుంటూ పోతే వేల ఘటనలు ఉన్నాయి. కోవిడ్ రోగులకు తమ హోటళ్లలో వైద్య సేవలు అందించిన మహోన్నతమైన వ్యక్తి. అందుకే భౌతికంగా దూరమైన ప్రతి ఇంటిలో ప్రతి మనిషి గుండెలో ఉండిపోయారు. అలాంటి ఉన్నతమైన వ్యక్తికి భారత రత్నతో గౌరవించాలని మహారాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## అత్యాధునిక వసతులతో ఈ స్కూళ్ల నిర్మాణం

- నేడు" యంగ్ ఇండియా - ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలకు" శంకుస్థాపన
- షాద్ నగర్ కొందుర్గ్ లో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్




**జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 10 :**

రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు రేపు (శుక్రవారం) వివిధ జిల్లాల్లోని 28 ప్రాంతాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. మొదటి దశలో చేపట్టనున్న ఈ యంగ్ ఇండియా

...మిగతాది 2 లో

## కేంద్రంలో చంద్రబాబు పరపతి పెరిగిందా..?



**జయభేరి, విజయవాడ, అక్టోబరు 10:**

కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు కీలకంగా మారనున్నారు. ఆయన త్వరలోనే కీ రోల్ పోషిస్తారని తెలిసింది. జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలయితే చంద్రబాబు డిమాండ్ మరింత పెరగనుంది. హర్యానాలో తిరిగి బీజేపీ పుంజుకుంది. జమ్మూ కాశ్మీర్ లో మాత్రం ఇండియా కూటమి ముందంజలో ఉంది. ఎలా జరిగినా

...మిగతాది 2 లో



## ఆమ్రపాలికి కేంద్రం షాక్

- సొంత రాష్ట్రానికి వెళ్లాలని ఆదేశాలు

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 10:**

గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ పోస్టుతోపాటు పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారిణి కాటా అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. తనను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించింది. ఆమెను విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ కు కేటాయిచారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో జాయినవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి అయిన అమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిని తోసి

...మిగతాది 2 లో

## రిటైర్మెంట్ ప్రకటించిన నాదల్

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 10:**

టెన్నిస్‌లో ఓ శకం ముగిసింది. సుదీర్ఘ కెరీర్‌కు స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ వీడ్కోలు పలికాడు. మట్టికోర్టు రారాజుగా టెన్నిస్ ప్రపంచాన్ని ఏలిన నాదల్... ఆకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకుని అభిమానులకు షాక్ ఇచ్చాడు. టెన్నిస్ ఓపెన్ శకం మొదలైన తర్వాత అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు కైవసం చేసుకున్న తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించిన నాదల్... ఇక ఆట చాలంటూ వీడ్కోలు పలికాడు. ఆటలో తనకు ఎదురులేదని.. మట్టి కోర్టులో తనను కొట్టే

...మిగతాది 2 లో



## ఏపీకి రూ.7,211 కోట్లు, తెలంగాణకి రూ.3,745 కోట్లు

**జయభేరి, న్యూఢిల్లీ:**

అక్టోబర్ నెలకు గాను రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాను కేంద్రం విడుదల చేసింది.

అడ్వాన్స్ ఇనిస్టాల్మెంట్ ₹89,086 కోట్లు తో కలిపి మొత్తం ₹1,78,173 కోట్లు ను పంపిణీ చేసింది. అత్యధికంగా ఉత్తర ప్రదేశ్ కి ₹31,962 కోట్లు, బిహార్ కు ₹17,921 కోట్లు, మద్య ప్రదేశ్ కు ₹13,987 కోట్లు అందించింది. ఇక ఏపీకి ₹7,211 కోట్లు తెలంగాణకి ₹3,745కోట్లు రిలీజ్ చేసింది.

పండుగల సీజన్ ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాల మూల ధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి ఈ సాయాన్ని అందించినట్లు పేర్కొంది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## రతన్ టాటాకు ఘన నివాళి

నుంచి 6 నెలల పాటు టాటా గ్రూప్‌నకు తాత్కాలిక ఛైర్మన్‌గా వ్యవహరించారు. దేశంలో మూడో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌ను 2000లో అందుకున్నారు. భారత రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ 2008లో ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ఆయనను సత్కరించింది. మహారాష్ట్ర, అస్సాం ప్రభుత్వాల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

**హిందూ సంప్రదాయంలోనే అంత్యక్రియలు**

రతన్‌టాటా పార్సీ మతస్తుడు కాబట్టి.. జొరాస్ట్రియన్ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. అయితే రతన్ టాటా అంత్యక్రియలు హిందూ సంప్రదాయంలో నిర్వహించనున్నట్లు తెలిసింది. అంతకుముందు సెప్టెంబర్ 2022లో, టాటా సన్స్ మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీ అంత్యక్రియలు కూడా హిందూ ఆచారాల ప్రకారం జరిగాయి. ఎందుకంటే కరోనా మహమ్మారి సమయంలో మృతదేహాలను దహనం చేసే పద్ధతుల్లో మార్పులు వచ్చాయి. ఆ సమయంలో, పార్సీ సమాజం అంత్యక్రియల ఆచారాలపై నిషేధం విధించారు.ఒకప్పుడు.. ప్రస్తుత ఇరాన్‌లో నివసించిన పార్సీ కమ్యూనిటీకి చెందిన కొద్దిమంది మాత్రమే ప్రపంచం మొత్తంలో మిగిలిపోయారు. 2021లో నిర్వహించిన సర్వే ప్రకారం, ప్రపంచంలో పార్సీల సంఖ్య 2 లక్షల కంటే తక్కువ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రత్యేకమైన అంత్యక్రియల సంప్రదాయం కారణంగా ఈ సంఘం ఇబ్బందులను ఎదుర్కొంటుంది. టవర్ ఆఫ్ సైలెన్స్‌కు సరైన స్థలం లేకపోవడం, డేగలు, రాబందులు వంటి పక్షులు దాదాపు అంతరించిపోవడంతో.. గత కొన్నేళ్లుగా పార్సీ ప్రజలు అంత్యక్రియల తీరును మార్చుకోవడం ప్రారంభించారు.పార్సీలలో అంత్యక్రియల సంప్రదాయం 3 వేల సంవత్సరాల నాటిది. వేల సంవత్సరాల క్రితం పర్షియా (ఇరాన్) నుండి భారతదేశానికి వచ్చిన పార్సీ సమాజంలో, మృతదేహాన్ని కాల్చడం లేదా పాతి పెట్టడం లేదు. పార్సీ మతంలో, మరణం తర్వాత, టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలువబడే సాంప్రదాయ స్మశానవాటికలో రాబందులు తినడానికి శరీరాన్ని బహిరంగ ప్రదేశంలో వదిలివేస్తారు. రాబందులు మృత దేహాలను తినడం కూడా పార్సీ సమాజ ఆచారంలో ఒక భాగం.

**పార్సీ సమాజంలో అంత్యక్రియలు ఎలా చేస్తారు?**

ప్రకృతిని గౌరవిస్తూ, పవిత్రతను పాటిస్తూ, ప్రాచీన ప్రక్రియలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు. ప్రేతాత్మల వల్లే మరణం సంభవిస్తుందనీ, మరణం తర్వాత శరీరం అపవిత్రం అవుతుందని జొరాస్ట్రియన్ల నమ్మకం. ఆత్మ సాఫీగా ప్రయాణించేందుకు వీలుగా, ఆధ్యాత్మిక, భౌతిక పవిత్రతపై దృష్టిపెడతారు.

**1. భౌతికకాయాన్ని శుభ్రం చేయడం :** భౌతికకాయానికి స్నానం చేయించి, సాధారణ తెలుపు దుస్తులు ధరింపజేస్తారు. ఫారసీ ప్రముఖులు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. దుష్టశక్తులు దాడిచేయకుండా ప్రార్థనలు చేస్తారు. ఆ తర్వాత ఒక తెల్లని శునకాన్ని తీసుకొస్తారు. భౌతిక కాయం పక్కన ఆ శునకాన్ని ఉంచుతారు. ప్రేతాత్మలను ఈ శునకం ఎదుర్కొంటుందని నమ్ముతారు.

**2. ప్రజల సందర్శన కోసం డెడ్‌బాడీ :** ఆ తర్వాత డెడ్‌బాడీని ఇంట్లో ఉంచుతారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆ డెడ్‌బాడీని సందర్శిస్తారు. అయితే ఆ డెడ్‌బాడీ ఎవరూ ముట్టుకోకుండా జాగ్రత్తపడతారు. చనిపోయిన ఆత్మ సాఫీగా ప్రయాణించడం కోసం ప్రార్థనలు నిర్వహిస్తారు. తప్పులేమైనా ఉంటే క్షమించాలని కోరతారు.

**3. అంత్యక్రియల కోసం ఊరేగింపు :** ఆ తర్వాత మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకెళతారు. ఈ సమయంలో డెడ్‌బాడీకి ప్రార్థనలు చేస్తారు.

**4. టవర్ ఆఫ్ సైలెన్స్ :** జొరాస్ట్రియన్ సంప్రదాయం ప్రకారం, డెడ్‌బాడీని టవర్ ఆఫ్ సైలెన్స్‌కి తీసుకెళతారు. అక్కడ బహిరంగ, ఏకాంత స్థలంలో మృతదేహాన్ని ఉంచుతారు. భూమి, అగ్ని పవిత్రత దెబ్బతినకుండా, సహజ పద్ధతిలో డెడ్‌బాడీ కుళ్లిపోతుంది. ఈ మృతదేహాన్ని రాబందులు ఆరగిస్తాయి.

**5. ఆత్మ ప్రయాణానికి ప్రార్థనలు:** టవర్ ఆఫ్ సైలెన్స్ దగ్గర డెడ్‌బాడీని ఉంచిన తర్వాత, మూడు రోజుల పాటు ప్రార్థనలు నిర్వహిస్తారు. అంటే మూడు రోజుల్లో, శరీరం నుంచి ఆత్మ వేరుపడుతుందని ఫారసీల నమ్మకం.

**6. సంతాప సమయం :** జొరాస్ట్రియన్ పద్ధతి ప్రకారం, ఒక వ్యక్తి మరణించిన తర్వాత నాలుగోరోజు, పదోరోజు, 13వ రోజునాడు సంతాప కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## అత్యాధునిక వసతులతో ఈ స్కూళ్ల..

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్ల పై సంబంధిత జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం సి.ఎస్. టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి అజిత్ రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు లు కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్ లో శాంతి కుమారి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, మధిర నియోజకవర్గం లో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారు ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని తెలియచేసారు. రేపు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధిత జిల్లాల మంత్రుల, ఇంఛార్జ్ మంత్రుల ఆమోదం పొందిన అనంతరం, ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సవ వాతావరణంలో, ఘనంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులందరినీ ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించాలని స్పష్టం చేసారు. ఈ స్కూళ్ల నిర్మాణాలను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. నేడు సాయంత్రమే సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో శంకుస్థాపన జరిగే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం భూమి లభ్యత ఉన్న ఈ 28 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రెండవ దశలో ఇతర ప్రాంతాల్లో భూమి ని గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని సి.ఎస్ తెలిపారు.

**శంకుస్థాపన జరిగే 28 నియోజకవర్గాలు**

శంకుస్థాపన జరగనున్న నియోజకవర్గాలు: కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్గొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, జడ్చర్ల, పర్కాల, నారాయణ్ ఖేడ్, దేవరకద్ర , నాగర్ కర్నూల్, మానకొండూర్, నర్సంపేట.

## కేంద్రంలో చంద్రబాబు పరపతి..

కేంద్ర ప్రభుత్వం చంద్రబాబు చెప్పినట్లు తలాడించాల్సిందే. ఎగ్జిట్ పోల్స్ కూడా దాదాపు అవే చెప్పాయి. కాంగ్రెస్ కూటములు రెండు రాష్ట్రాల్లో విజయం సాధిస్తుందని చెప్పాయి. దీంతో చంద్రబాబు ఇక అడిగింది అడిగినట్లు జరుగుతుంది. మోదీ కూడా తన పాత వైఖరిని పక్కన పెట్టి చంద్రబాబును మంచి చేసుకోవడానికే ప్రయత్నించాలి. ఒకరకంగా ఆంధ్రప్రదేశ్ కు ఇది శుభపరిణామమేనని అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఇప్పుడు కేంద్రంలో తలెత్తాయి. మోదీ ప్రభుత్వం పూర్తిగా చంద్రబాబు మద్దతు పై ఆధారపడింది. అలాగని చంద్రబాబు గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యంగా ఆయన అనేక మార్లు ఢిల్లీ వెళ్లారు. కేంద్రంలో పెద్దలు కలిశారు. ముఖ్యంగా రాజధాని అమరావతి, పోలవరం నిధుల కోసం ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రం సహకరిస్తే ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేయడం సులువుగా మారుతుంది. చంద్రబాబు విభజన ఆంధ్రప్రదేశ్ కు రెండో సారి సరైన సమయంలో ఆయనకు ముఖ్యమంత్రి పదవి దక్కింది. మోదీని యాచించే పరిస్థితి నుంచి శాసించే స్థాయికి రావడం రాష్ట్రానికి మంచిదే.ఇప్పుడు చంద్రబాబు ముందున్న లక్ష్యం కేవలం ఆ రెండు ప్రాజెక్టులు మాత్రమే కాదు. కేవలం అమరావతి, పోలవరం ప్రాజెక్టు అని కూర్చుంటే భవిష్యత్ లో రాజకీయంగా ఇబ్బందులు తప్పవు. ఆయన మిగిలిన సమస్యలపైన కూడా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు తేవాల్సి ఉంటుంది. అలా కాకుండా అమరావతి, పోలవరంపైనే ఫోకస్ పెడితే మాత్రం అభాసుపాలు కాక తప్పదు. మోదీ ప్రభుత్వం కూడా ఆ రెండింటికీ సాయం చేసి మిగిలిన వాటి విషయంలో చేతులెత్తేస్తే అప్పుడు జనాలకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడతుంది.అయితే చంద్రబాబు నాయుడు అనుభవం ఉన్న నేత. ఆయనకు వేరు ఇంకొకరు చెప్పాల్సిన పనిలేదు. చరిత్రలో చిరస్థాయిగా తన పేరును నిలిచిపోవడానికి పోలవరం, అమరావతి నిర్మాణాలను పూర్తి చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. అదే సమయంలో అన్ని ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా, మరిన్ని నిధులు తేవాలన్న ప్రయత్నంలోనే ఢిల్లీలో మకాం వేసి ఉన్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో హామీని నెరవేర్చి ఆయన తానేంటో నిరూపించుకోవాలనుకుంటున్నారు. చంద్రబాబు కు అలా కలసి రావడంతో ఢిల్లీలో ఆయన చెప్పినట్లే జరిగే అవకాశాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే ఎక్కువ సార్లు ఢిల్లీ వెళ్లి రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తున్నారన్నది అంతే నిజం.

# దేశానికి వెన్నెముక.. రతన్ టాటా జీ...

- మీరు లేని ఈ దేశం ఒక అనాధగా మారిపోయింది
- పారిశ్రామిక రంగ అభివృద్ధి పూర్తిగా మౌనందాల్చింది.
- విలువలకు వ్యక్తిత్వానికి పరిపూర్ణమైన రూపం మీ నిండైన జీవితం...
- పేదవాడి ఆకలిని ఎరిగిన మహా ఋషి...
- అజాతశత్రువుగా మీ జీవితం ఈ సమాజానికి దర్పణం.
- అందుకే మీ జీవితాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న ము..
- విలువలకు ప్రాణమిచ్చే అతని పారిశ్రామిక వ్యాపార దిగ్గజ శిఖరానికి దేశం సలాం కొడుతోంది.
- ఎన్నో నష్టాలతో కూరుకుపోయిన స్టార్ట్ కంపెనీలకు తాను జీవం పోసి తిరిగి బతికించిన పారిశ్రామిక దిగ్గజం ఇక సెలవ అంటూ ఈ లోకాన్ని వీడింది. ఆ మహానుభావుడు గురించి కొన్ని అక్షరాలు రాయడం ఈ జన్మకు నేను అందుకున్న ఓ గొప్ప వరంగా భావిస్తూ "జయభేరి" న్యూస్ అందిస్తున్న కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ విశ్లేషణ...







✍ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ ఎనలిసిస్టు, కవి, రచయిత, గాయకుడు, సామాజిక ఉద్యమకారుడు

✍ జయభేరి, హైదరాబాద్ :

**రతన్ టాటా ఈ పేరు వింటేనే టాటా కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్. తాను ఈ బాధ్యతను స్వీకరించినప్పటి నుంచి ఎన్నో విజయాలు ఎన్నో సాహసాలు ఎన్నెన్నో పారిశ్రామికంగా స్టార్టప్ కంపెనీలకి జీవం పోసిన చరిత్రలు ఒక్కసారి మౌనం దాల్చాయి. దేశమాత ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయింది. పారిశ్రామిక రంగం దిక్కులేనిది అయిపోయింది. చిరు ఉద్యోగిగా మొదలుపెట్టిన తన జీవిత ప్రస్థానంలో ఇంత ఎత్తుకు ఎదిగిన తనలో కొంచమైన గర్వం లేని తన జీవితానికి మనం ఎన్నిసార్లు సలాం కొట్టిన తక్కువేనేమో..**

విలువలతో కూడిన జీవితం. తాను సంపాదించిన ఆస్తిలో 75% ఈ సమాజానికి కాదు ఈ దేశానికి అందించిన దాతృత్వ గుణానికి నిదర్శనం రతన్ టాటా రూపం. దేశంలో 34 లక్షల కోట్ల నెట్వర్క్ తనకు ఉందంటే దాని వెనుక ఎంత కృషి ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఆయనకు సాటి ఎవరూ లేరు. ఆయనకు పోటీ ఎవరు రాలేకపోయారు...

వ్యాపార దీక్షలో అశాంత శత్రువుగా ఆయనకు ఆయనే పోటీగా సాధించిన విజయాలు ఎన్నో... ఉప్పు నుండి ఎలక్ట్రానిక్ రంగాల దిగ్గజామిగా ఎదిగిన ఆయన సాహసోపేతమైన వ్యాపార నిర్ణయాలు ఈనాటి చిరు వ్యాపారులకు కూడా మార్గదర్శకంగా మారిపోతుంది. అందుకే భారతదేశ పాఠ్యపుస్తకాల్లో అన్ని రాష్ట్రాల్లో అన్ని భాషల్లో ఈయన జీవిత చరిత్ర ముద్రించాలని డిమాండ్ కూడా వస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే భారతరత్న కచ్చితంగా ఇవ్వాలని ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయించింది. 1960 నుంచి ఈనాటి వరకు ఆయన ఎన్నో ఎన్నెన్నో విజయాలు సాధించిన తన జీవితాన్ని మాత్రం సాధారణంగా గడుపుతూ గడిచిన కరోనా సమయంలో 1500 కోట్ల రూపాయలను ఆయన ఈ సమాజానికి అందించి ఎంతో మందికి ఆయువును పోశారు. అందుకే ఆయన చనిపోలేదు ఆయన చిరంజీవిగా మనమధ్య సదా సజీవులుగా నివసిస్తారు. ఆయనను ఒక మోటివేషనల్ గా తీసుకొని ఆయన నుంచి ఇన్స్పైర్ పొందిన ఎంతోమంది ఇవ్వాళ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలుస్తున్నారు. భారతదేశ తన వెన్నుముకను కోల్పోయినట్టుగా ఇవ్వాలా దేశం మొత్తం దుఃఖసాగరంలో మునిగింది.
రతన్ టాటా గురించి ఒక్కసారి నెమరు వేసుకుంటే చరిత్రపుటల్లో ఆయన సాధించిన విజయాలు కొన్నింటిని మీ ముందు ప్రస్తావిస్తున్నాం.. 1962లో సన్స్ లో రతన్ టాటా ప్రవేశించి లాభాలలో గాడిలోకి పెట్టారు. 1971లో ఆర్థిక సంక్షోభంతో నెలకొన్న మేలుకో గ్రూప్ ఆఫ్ కంపెనీకి ఇన్చార్జిగా ఆయన బాధ్యత స్వీకరించి ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేశారు. 1977లో ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఎంప్రెస్ మిల్స్ కి బదిలీగా వచ్చి అక్కడి ఆర్థిక సంక్షోభాన్ని కూడా అధికమించి గాడిలో పెట్టారు. 1991 లో రతన్ టాటా ను టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ గా నియమించిన ఏనాడూ ఆయన తన విలువలను కోల్పోలేదు. ఎంత ఎదిగిన వరిగుండే నిండైన ఆయన వ్యక్తిత్వానికి 21 సంవత్సరాలు టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ గా ఆయన సేవలు అజరామరం అనిర్వచనీయం అమోఘం..
సాఫ్ట్వేర్ టెలికాం ఫైనాన్స్ రిటైర్ తదితర రంగాల్లో ఆయన తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల వల్ల ఎన్నో స్టాటప్ కంపెనీలు కూడా ఇవ్వాలా అగ్రహాన్నిగా నిలుస్తూ ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నాయి. ఆయన లేని పారిశ్రామిక రంగం అనాధగా మిగిలిపోయింది అంటే అతిశయోక్తి కాదు. అందుకే నేడు ఆయన పార్థివదేహాన్ని పారిశ్రామిక రంగ దిగ్గజలందరూ వచ్చి అన్ని రంగాల కళాకారులు వచ్చి ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తుంటే భరతమాత కడుపులోకం నింగిని తాకింది. ఇంతవరకు ఎవరు సాధించలేని విజయాలు పారిశ్రామిక రంగంలో వ్యాపారంలో టెలికాం రంగంలో ఫైనాన్స్ రంగాల్లో ఆయన ఆలోచన భావితరాలకు మార్గదర్శకునిగా ఉపయోగపడుతుంది. రతన్ టాటా అంటే ఒక సాధారణ మధ్యతరగతి జీవితం మన కళ్ళకు కట్టినట్టే కనిపిస్తోంది. వందల కోట్ల వేల లక్షల కోట్ల ఆదాయ వనరులు ఉన్న ఆయన గడిపిన సాధారణ జీవితం ఒక్కసారి మనందరం జ్ఞాపకం తెచ్చుకోవాలి.

**రతన్ టాటా అంటే భారతదేశానికి ఆయన ఒక రారాజు. పారిశ్రామిక రంగంలో ఆయన తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల వల్ల ఇవ్వాల మనం తింటున్న ఉప్పు దగ్గర నుంచి మనం తిరిగే కార్ల వరకు ఆయన ఆనాడు సాహసోపేతంగా తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు లక్ష రూపాయల్లో సాధారణ ప్రజలు కూడా కారులో తిరిగే భాగ్యాన్ని కలిగించింది ఒక రతన్ టాటానే... అంటే సాధారణ ప్రజల జీవన విధానం ఆయనకు బాగా తెలుసు.**

**అందుకేనేమో ఆపత్కర సమయాల్లో కొన్ని వందల కోట్ల రూపాయలను ఆయన ధారాళంగా అందించారు. పరిపూర్ణ జీవితానికి నిండైన వ్యక్తిత్వం ఆయన ప్రతిరూపం ఆయన రూపం. రతన్ టాటా జీవిత చిత్రాన్ని ఆయన జీవిత కథను నీటి పాఠ్యపుస్తకాల్లో ఖచ్చితంగా చేర్చాలి. ఆయనకు ఏమిచ్చినా ఈ దేశం రుణం తీర్చుకోదు. అందుకని యువ పారిశ్రామికవేత్తలు అందరూ ఆయన జీవిత చరిత్రను కచ్చితంగా పుస్తక రూపంలో చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలి. ఈ దేశానికి వెన్నెముకగా పారిశ్రామిక రంగ అభివృద్ధికి కృషిచేసిన రతన్ టాటా ఆయన వ్యక్తిత్వం ఆయన ఆలోచనలు మరెవ్వరికీ రావేమో... విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన నిండైన పరిపూర్ణ జీవితం పొందుకున్నారు రతన్ టాటా జి...** అందుకే ఆయనను మనస్ఫూర్తిగా మరొకసారి గుర్తు చేసుకుంటూ ఆయనకు మరణం లేదు. ప్రజల జీవన గమనంలో ఆయన ఎప్పుడు సజీవంగానే ఉంటారు. ఆయన ఆలోచన నుండి ఆవిష్కరించిన ఎన్నో పారిశ్రామిక విప్లవాత్మకమైన నిర్ణయాల వల్ల ఈరోజు మనం లబ్ధి పొందుతున్నాం. టాటాజి నిజంగా మీరు గ్రేట్..

**ఈ దేశం మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోదు. ఈ ప్రజలు మీ సేవల్ని ఎన్నటికీ వీడిపోరు. ఈ దేశంలో పుట్టినందుకు మేము అదృష్టవంతులుగా భావిస్తున్నాము...**

మమ్ము విడిపోకుండా పదేపదే గుర్తుకు వచ్చే విధంగా అన్ని రంగాల్లో మీరు అందించిన సేవలు ఆవిష్కరించిన పారిశ్రామిక వ్యాపార కేంద్రాలు ప్రతి నిత్యం మాకు బాధ్యతను గుర్తు చేస్తూనే ఉంటాయి. అందుకే మీరు లేని ఈ దేశం ఒక అనాధగా మిగిలిపోయింది. నీలా ఎవరు ఉండరు మీలా ఎవరు ఆలోచించరు. కారణజన్ముడై కలకాలం చిరంజీవిగా మాతోనే మాలోనే జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం...

## ఆమ్రపాలికి కేంద్రం షాక్

పుచ్చారు. ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కే చెందుతారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీసు అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఆ కమిటీ నిబంధనల ప్రకారం విభజించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న పలువురు తమ క్యాడర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి,క్యాట్‌కు దరఖాస్తుకు పెట్టుకున్నారు. ఏపీకి కేటాయించిన ఎక్కువ మంది తాము తెలంగాణ స్థానికతతో ఉన్నామని తమకు తెలంగాణ క్యాడరే కావాలని ఉండిపోయారు. అలాంటి అధికారి అయిన సోమేష్‌కుమార్ ఏపీలో సీఎస్‌గా ఉండగా కోర్టు ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. దాంతో ఆయన తెలంగాణ నంచి రిలీవ్ అయి ఏపీలో రిపోర్ట్ చేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు అమ్రపాలికి కూడా దాదాపుగా అదే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ కమిషనర్ గా ఉన్న ఆమె ఉన్నపళంగా ఏపీలో రిపోర్టు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఖండేకర్ కమిటీ సిఫారసులు చేసిన సమయంలో స్థిర నివాసం అనే కాలమ్‌ను కీలకంగా తీసుకున్నారు. యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన సమయంలో కాట అమ్రపాలి తన పర్మినెంట్ అడ్రస్‌గా విశాఖ పట్నంను పేర్కొన్నారు. ఖండేకర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత ప్రత్యూష్ సిన్హా కమిటీ ఆ నివేదిక ఆధారంగా క్యాడర్ ను కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఖండేకర్ కమిటీ ఆమెను ఏపీకి కేటాయించింది. అయితే తనను తెలంగాణ స్థానికురాలిగా పరిగణించి.. తెలంగాణకే కేటాయించాలని ఆమె అప్పీల్ చేసుకున్నారు. ప్రత్యూష్ సిన్హా కమిటీ మొదట్లోనే ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. హైకోర్టు కూడా ఖండేకర్ కమిటీ ఆధారంగా ప్రత్యూష్ సిన్హా కమిటీ చేసిన సిఫారసులనే అమలు చేయాలని స్పష్టం చేసింది. కాట అమ్రపాలికి ప్రస్తుతం అన్ని మార్గాలు మూసుకుపోయినట్లేనని ఆమె ఖచ్చితంగా తెలంగాణలో రిలీవ్ అయ్యి.. ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని భావిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వరంగల్ జిల్లాకు కలెక్టర్ గా చేసిన అమ్రపాలి తర్వాత కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఓఎస్డీగా.. ప్రధానమంత్రి కార్యాలయంలోనూ పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ తెలంగాణకు వచ్చారు రేవంత్ సర్కార్ లో ఆమెకు కీలక పోస్టులు దక్కాయి. అయితే ఇప్పుడు ఏపీకి తప్పక వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## రిటైర్మెంట్ ప్రకటించిన నాదల్

మొనగాడు లేడని.. ఫోర్ హ్యాండ్, టూ హ్యాండెడ్ ఫోర్‌షాట్లను తనలా కొట్టే ఆటగాడే లేడని నిరూపించిన నాదల్... ఆటకు గుడ్‌బై చెప్పేశాడు.

**భావోద్వేగ ప్రకటన**

టెన్నిస్ లెజెండ్, 22 సార్లు గ్రాండ్ స్లామ్ సింగిల్స్ ఛాంపియన్ రాఫెల్ నాదల్ టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. డేవిస్ కప్ తర్వాత ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైర్ అవుతానని 38 ఏళ్ల నాదల్ ప్రకటించాడు. "గత కొన్నేళ్లుగా నేను చాలా కష్టకాలం ఎదుర్కొంటున్నాను. ముఖ్యంగా గత రెండేళ్లుగా నాకు చాలా క్లిష్ట సమయం. అందుకే కీలక నిర్ణయం మీతో పంచుకుంటున్నాను. డేవిస్ కప్ నా చివరి టోర్నమెంట్ అని చెప్పేందుకు నేను చాలా సంతోషిస్తున్నాను." అని నాదల్ తెలిపాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో నాదల్ రికార్డు స్థాయిలో 14 టైటిళ్లను సాధించాడు. 2022లో నాదల్ చివరిసారి రోలాండ్ గారోస్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. నాదల్ కెరీర్ ఇటీవల వరుస గాయాలతో గాడి తప్పింది. టెన్నిస్ చరిత్రలో అత్యంత పట్టుదలగల ఆటగాడిగా నాదల్‌కు పేరుంది. నాదల్ రెండు దశాబ్దాల కెరీర్‌లో 92 టైటిళ్లను సాధించాడు. 135 మిలియన్ డాలర్ల ప్రైజ్ మనీ సంపాదించాడు. 2005లో 19 ఏళ్ల వయసులో నాదల్ తొలి ఫ్రెంచ్ ఓపెన్ విజయం సాధించాడు. నాలుగు US ఓపెన్ టైటిళ్లు, రెండు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లను కూడా నాదల్ సాధించాడు, నాదల్ 2008లో ఒలింపిక్ బంగారు పతకాన్ని కూడా గెలుచుకున్నాడు. ఐదుసార్లు ప్రపంచ నంబర్ వన్ గా నిలిచాడు. 2005 నుంచి 2024 వరకు నమ్మశక్యం కాని రీతిలో 17 ఏళ్లపాటు ATP ర్యాంకింగ్స్‌లో టాప్ 10లో కొనసాగాడు. ఛాంపియన్ అంటే ఎలా ఉండాలి.. అచ్చం నాదల్‌లా ఉండాలి. ఎందుకంటే రఫేల్ నాదల్ పడి లేచిన కెరటం. ఎందుకంటే నాదల్ వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని మరీ ఉన్నతస్థానాన్నికి చేరాడు. 2009 వరకూ ఫ్రెంచ్ ఓపెన్‌లో నాదల్‌కు అసలు ఓటమే లేదు. కానీ 2009లో నాదల్ తల్లిదండ్రులు విడిపోయారు. ఆ ఏడాదే నాదల్ తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ ఓడిపోయాడు. కానీ నాదల్ అంతటితో ఆగిపోలేదు. కెరటంలా మళ్లీ లేచాడు. 2010లో 2010లో మళ్లీ పుంజుకున్న నాదల్ ఏకంగా మూడు గ్రాండ్‌స్లామ్‌లను కైవసం చేసుకుని తానేంటో క్రీడా ప్రపంచానికి చూపించాడు. ఎందుకు తనను ఛాంపియన్ అంటారో మరోసారి చాటిచెప్పాడు.

**ఈ గణాంకాలు చాలవు**

2005, 2006, 2007, 2008, 2010, 2011, 2012, 2013, 2014, 2017, 2018, 2019, 2020, 2022... ఏంటి ఈ సంవత్సరాలు అనుకుంటున్నారా... స్పెయిన్ బుల్ రఫేల్ నాదల్ ఫ్రెంచ్ ఓపెన్‌ను కైవసం చేసుకున్న సంవత్సరాలు. అంతే కాదు... 2009, 2022లో ఆస్ట్రేలియన్ ఓపెన్, 2008, 2010లో వింబుల్డన్... 2010, 2013, 2017, 2019లో యూఎస్ ఓపెన్‌ను నాదల్ కైవసం చేసుకున్నాడు. ఈ గణాంకాలు చాలు టెన్నిస్ ప్రపంచాన్ని నాదల్ ఎంతలా ఏలాడు అని చెప్పడానికి.

# తెలంగాణ సంస్కృతి ప్రతిరూపమే బతుకమ్మ పండుగ

- తీరొక్క రకాల పూలను పేర్చి బతుకమ్మను పేర్చడమే తెలంగాణ సాంప్రదాయం
- పువ్వులను దేవతగా కొలిచే పండుగే బతుకమ్మ పండుగ

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 10 :**



గజ్వేల్ లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వారి ఇండ్లలో బతుకమ్మను పేర్చి ఆయా ప్రధాన కూడళ్ళ వద్ద బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. బతుకమ్మ వేడుకలు మహిళలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు.



**వర్గల్ లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**

ప్రపంచంలో పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ పండుగ అని తెలిపారు. గురువారం వర్గల్ లో గ్రామ పంచాయతి దగ్గర సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో బతుకమ్మ పండుగ రాగానే పల్లెలు పట్నాలు ఉయ్యాల పాటలతో మారుమోగుతున్నాయి. తెలంగాణ ఆడపడుచులకు తొమ్మిది రోజులు ఆటపాటలతో అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. తీరొక్క పువ్వులతోనే సాకే వేడుక తొమ్మిది రోజుల పాటు నిర్వహింస్తారు. తెలంగాణ సాంస్కృతికి చిహ్నమే బతుకమ్మ పండుగ రంగురంగుల పూలతో ప్రతి గ్రామంలో శోభాయమానంగా మారిపోతుందన్నారు.



## ఘనంగా బతుకమ్మ సంబరాలు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భగా ఉప్పల్ డివిజన్ పరిధిలోని సరస్వతి నగర్ లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ మన బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం అని ఆయన అన్నారు. పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించి, పసుపు ముద్దను చేసి, నిండు మనస్సుతో గౌరమ్మను కొలిచే నిండైన వేడుక మన బతుకమ్మ పండుగ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మహిళ సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

## దుర్గాదేవీని సందర్శించి ప్రత్యేక పూజలు


- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్, హెచ్ బీ కాలనీ, మంగాపురం, ఓల్డ్ మీర్పేట్ కాలనీ, తిరుమలనగర్ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు దుర్గామాత మండపాలను సందర్శించి అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాసం మహిపాల్ రెడ్డి, గుమ్మడి జంపాల్ రెడ్డి, రామ్మోహన్రావు, కోటిరెడ్డి, కృష్ణమూర్తి, చారి, రాజు, రాకేష్ గౌడ్, వేణు గౌడ్, శ్రీనివాస్, నవీన్ గౌడ్, కుమార్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ హనుమాన్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉయ్యాల పాటలతో హనుమాన్ నగర్ కాలనీ మారుమోగాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడపడుచులు ఆడిపాడారు. గాజుల చేతుల చప్పట్లతో.. కాలనీ మారుమోగాయి. హరివిల్లు నేలపై పరుచుకుందా అన్నట్లుగా మహిళలు, యువతుల కేరింతలతో సందడిగా మారాయి. గౌరమ్మను కొలుస్తూ జరుపుకున్న సద్దుల బతుకమ్మ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పూల సింగిడి నేలకు దిగిందా అన్నట్టుగా చౌరస్తా బతుకమ్మలతో, ఆడపడుచులతోనూ మురిసిపోయాయి. మహిళామణుల పండుగగా పిలుచుకోనే బతుకమ్మలో సందడిగా ఆడిపాడుతున్నారు. 9 రోజుల ఈ వేడుకలో తంగేడు, జిల్లేడు, గునుగు, బంతి, చేమంతి ఇలా ఎన్నెన్నో కుసుమాలు ఈ పండుగ కోసమే పూశాయా అనిపిస్తాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గంటా రవీందర్ రెడ్డి, చీపురుపల్లి నాగరాజు, కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, తరువు రమేష్, తోలుపునూరి నవీన్ గౌడ్, పెద్ది అమరేందర్ రెడ్డి, ఎస్ కే ఖాసీం వలీ, ఇట్టి రెడ్డి రామచంద్రారెడ్డి, వి. కృష్ణ, విజయ్, తండు రాము గౌడ్, గూదె సత్యనారాయణ, కనికె శ్రీరాములు, పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



**జయభేరి, సైదాపూర్ :**

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ గురువారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దునపల్లి గ్రామంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో బతుకమ్మ పండుగ రాగానే పల్లెలు, పట్నాలు ఉయ్యాల పాటలతో మారుమోగుతున్నాయి. తెలంగాణ ఆడపడుచులకు తొమ్మిది రోజులు ఆటపాటలతో అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. తీరొక్క పువ్వులతోనే సాగే వేడుక తొమ్మిది రోజుల పాటు నిర్వహింస్తారు. తెలంగాణ సాంస్కృతికి చిహ్నమే బతుకమ్మ పండుగ రంగురంగుల పూలతో ప్రతి గ్రామంలో శోభాయమానంగా మారిపోతుందన్నారు.





## ఘనంగా సద్దుల బతుకమ్మ

**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి ఇంట్లో సద్దుల బతుకమ్మ సందర్భంగా బతుకమ్మను పేర్చిన కుటుంబ సభ్యులు.. గురువారం నాడు పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి ఇంట్లో సద్దుల బతుకమ్మ సందర్భంగా బతుకమ్మను తీరొక్క పువ్వులతో పేర్చరు పోచారం మున్సిపల్ అడపడుచులందరికి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొండల్ రెడ్డి అమ్మాగారు దశాలక్ష్మి, తిరుమలత, శైలజ, స్వప్న, జీవిక తదితరులు పాల్గొన్నారు.

## శామీర్ పేట్ లో బతుకమ్మ పండుగ వేళ విషాదం

- తామర పువ్వు కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి వ్యక్తి మృతి
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**జయభేరి, అక్టోబర్ 10:**

బతుకమ్మ పండుగ ఆ ఇంట విషాదం నింపింది. తామర పువ్వు కోయడానికి నీటి గుంతలో దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శామీర్ పేట్ మండల కేంద్రంలోని చాపలబావి సమీపంలో రంగు సోమయ్య (65) అనే వ్యక్తి వాచ్ మెన్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే బతుకమ్మ పండుగ సందర్భంగా పక్కనే ఉన్న నీటిగుంటలో తామర పువ్వు కోయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు . పువ్వు కోసం వెళ్లిన సోమయ్య తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు నగేష్ అక్కడకు వెళ్లి చూడగా సోమయ్య విగతజీవిగా కనిపించాడు. వెంటనే నగేష్ శామీర్ పేట పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని నీటి కుంటలో పడిన సోమయ్య మృతదేహన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శామీర్ పేట సిఐ శ్రీనాథ్ తెలిపారు.

## అభివృద్ధి పనులతోనే అందరికీ ఆదర్శం

- ములుగు మాజీ సర్పంచ్ బాలమ్మ వర్ధంతి వేడుకలో నాయకులు

**జయభేరి, గజ్వేల్(ములుగు) :**



ప్రజా ప్రతినిధులు అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధికి చేసిన పనులే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, అలాంటి నాయకులే అందరికీ ఆదర్శంగా నిలుస్తారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుదు నర్సారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సలీం, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జుబేర్ పాషా తెలిపారు. మండల కేంద్రమైన ములుగుకు చెందిన మాజీ సర్పంచ్ చింతకింది బాలమ్మ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ములుగులో ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ములుగు గ్రామాభివృద్ధిలో బాలమ్మ పాత్ర ఎంతో ఉందన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించి అందరి మన్ననలు పొందిన మహిళగా నిలిచిందన్నారు. అంతకుముందు ఎన్నో దశాబ్దాలుగా పరిష్కారం కాని అనేక సమస్యలను తీర్చి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజా ప్రతినిధులు పదవుల్లో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. బాలమ్మ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ భూపాల్ రెడ్డి, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్ రెడ్డి, కేఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కడపల నరసింహారెడ్డి, మండల రెడ్డి సంఘం అధ్యక్షులు చికెన్ బాల్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు రాజాలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కరుణాకర్ రెడ్డి, బాలరాజు, లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కిష్టయ్య, సురేష్,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైలంపూర్ ప్రభాకర్ గుప్తా, ఆచ్చాయపల్లి గోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోశయ్య, సత్యానారాయణ గౌడ్, మంగలి గాలయ్య, కామునికంతల రాములు, కుతాడి శ్రీనివాస్, యాదగిరి, మహంకాళి, గణేష్, ముత్యాలు, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, చింతకింది కిష్టయ్య, శివ్వులు తదితరులు పాల్గొన్నారు.

## సకల శక్తి స్వరూపిణి నమః..!

- త్రిశూరధారిని శ్రీ దుర్గాదేవి అవతారంలో శ్రీ విద్యాధరి అమ్మవారు

**జయభేరి, గజ్వేల్(వర్గల్), అక్టోబర్ 10:**



ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో గురువారం త్రిశూరధారిని శ్రీ దుర్గాదేవి అవతారంలో భక్తులకు శ్రీ విద్యాధరి అమ్మవారు దివ్య దర్శనం కల్పించారు. సకల శక్తి స్వరూపిణి శ్రీ దుర్గాదేవిని ఆరాధిస్తే కష్టాలు వైదొలగి చల్లని చూపుతో అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు ప్రాప్తి



స్తాయని ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. ముఖ్యంగా నవరాత్రి పర్వదినాల సందర్భంగా ప్రతినిత్యం ఏదో ఒక అవతారంలో అమ్మవారు దివ్య రూప దర్శనం ఇస్తుండగా, దుర్గముడనే రాక్షసుడిని సంహరించినందున అమ్మవారు దుర్గాదేవిగా ఆవిర్భవించినట్లు పురాణాలు చెబుతున్నట్లు స్పష్టం చేశారు. కాగా మొదటగా శ్రీ విద్యాదరి క్షేత్రంలో తెల్లవారుజామున గణపతి పూజ, పుణ్యాహవాచనము, మహాభిషేకము, కలశస్థాపన, చతుష్షుపచార పూజ, మూలమంత్ర హవనము, చండీ హోమము తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా, క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

**విద్యాధర క్షేత్రంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**

భక్తుల ఇలవేల్పు విద్యాధరి క్షేత్రాన్ని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, నాయకులు సుభాష్ చంద్రబోస్, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కార్పొరేట్ వైద్యం.. ప్రభుత్వ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే,డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి

**జయభేరి, గజ్వేల్(వర్గల్), అక్టోబర్ 10:**

రాష్ట్రంలోని పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే,జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు, గురువారం వర్గల్ లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని,దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇందుకోసం పేదల జీవితాలలో వెలుగులు నింపడమే ప్రధాన ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, గజ్వేల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్,మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, నాయకులు, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్,బాల్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి,కడపల నరసింహారెడ్డి,పసుల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



## పరిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ

- ఇటిక్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా

**జయభేరి, గజ్వేల్(జగదేవపూర్), అక్టోబర్ 10 :**

బతుకమ్మ పండుగ దసరా పండుగ పురస్కరించుకొని జగదేవపూర్ మండలం పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులకు గురువారం ఆర్. బి మెమోరియల్ టెస్ట్ చైర్మన్, స్థానిక తాజా మాజీ సర్పంచ్ రవికంటి చంద్రశేఖర్ గుప్త చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు దూస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల శ్రమను గుర్తించాలన్నారు ప్రస్తుత కార్మికులు తమ ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ప్రజా ఆరోగ్యం కోసం అహర్నిశలు పనిచేస్తారన్నారు. పారిశుద్ధ్య పనులు నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఆయన ప్రశంసించారు. అందరి ఆరోగ్య బాధ్యతలను పారిశుద్ధ్య కార్మికులే మోస్తున్నారని, ప్రజలు నడిచే దేవుళ్లు అని కొనియాడారు. పరిశుభ్రతకు మన వంతు సహకారం అందిస్తేనే వారి కష్టాన్ని కొంతైనా తగ్గించిన వారమవుతామన్నారు. అక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా, నిర్దేశించిన ప్రదేశంలో చెత్త ఉంచాలని, అలాగే ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనాలకు అందజేయాలని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ఆలోచన చేయాలన్నారు. మనం సంపాదించిన దాంట్లో లేని తృప్తి ఇలాంటి సేవ చేయడంలోనే సంతృప్తి ఆనందం కలుగుతుందని తెలిపారు. అంతకుముందు పరిశుద్ధ్య కార్మికులు మాట్లాడుతూ ప్రతి పండుగకు మంచికి చెడుకు అండగా మాకు ఉంటున్న మా దేవుడు మా గ్రామ సర్పంచ్ అని గ్రామ అభివృద్ధి తో పాటు గ్రామ ప్రజా ల కోసం కృషి చేస్తూ గ్రామ ఆడబిడ్డలకు అండగా ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నా అని అండగా నిలిచే గొప్ప మనసున్న మహారాజు మాసర్పంచ్ రవికంటి చంద్రశేఖర్ గుప్తా అని పరిశుద్ధ్య కార్మికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్మికులకు దుస్తులు

- నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్



**జయభేరి, అక్టోబర్ 10:**

దసరా పండగ నేపథ్యంలో మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోనీ పంచాయితి కార్మికులకు మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ దుస్తులను అందచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండగ సందర్భంగా పంచాయితీ కార్మికులకు దుస్తులు అందజేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులు అనునిత్యం గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తారని వెల్లడించారు. వారి కుటుంబాలు సంతోషంగా పండగ జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో వారికి దుస్తులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, ఉప్పెన జగదీశ్వర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై ఏడీఈ కి వినతిపత్రం

- సమస్యను పరిష్కరించాలని కమిటి సభ్యుల విజ్ఞప్తి



**జయభేరి, అక్టోబర్ 10:**

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం ఉద్దేమర్రి గ్రామంలోని విష్ణు, శివాలయంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శామీర్ పేట్ సబ్ డివిజన్ ఏడిఈ వెంకటరమణారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు చింతలపల్లి మండలం ఉద్దెమర్రి శ్రీ విష్ణు, శివాలయంలో విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామనీ, దేవాలయం ప్రాంగణంలో సుమారు 10 ఇంటర్ పోల్స్ తో పాటు, ఒక ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలు సైతం గాలి, వాన వచ్చినప్పుడు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇక ఈ దేవాలయానికి నగరం నుండే కాక సమీప జిల్లాలైన మేడ్చల్, నల్గొండ, మెదక్, రంగారెడ్డి నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారని , అయితే రాత్రి సమయంలో నిద్రించేందుకుగాను సరైన వెలుతురు లేక భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ దేవాలయమునకు భక్తుల సౌకర్యార్థం విద్యుత్ స్థంభాలు, వైరింగ్ తో పాటు లైటింగ్ సదుపాయాలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు . ఇందుకు ఏ డి ఈ సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు, పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



**జయభేరి, అక్టోబర్ 10:**

మేడ్చల్ జిల్లా ఉమ్మడి శామీర్ పేట్ మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆడపడుచులు అందరూ బతుకమ్మ సంబరాలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తంగేడు, గునుగు లతో పాటు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి ఒకచోట పేర్చారు. అనంతరం బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. పోయి రావమ్మా బతుకమ్మ అంటు చెరువుల్లో నిమజ్జనం చేశారు.

# బతుకమ్మ ఉయ్యాలో పోయిరా బతుకమ్మ ఉయ్యాలో

# తీరొక్కపులతో బతుకమ్మల అలంకరణ..

- ఆటపాటలతో ఆడపడుచుల సంబరం..
- జానపద పాటలు డిజే స్టెప్పులతో అమ్మాయిల నృత్యాలు..

**జయభేరి, మేడ్చల్ :**



తెలంగాణ రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ కోలాహలం గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో సందడి సందడిగా సాగింది. తీరొక్క పూలతో మహిళలంతా వీధివీధినా బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, తొమ్మిది రోజులు, నైవేద్యాలతో, తొమ్మిది రూపాలలో అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించారు. పులా పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ సంబరాలు మహిళల చప్పట్లు, యువతుల కోలాటలతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మెట్టినింటి నుంచి పుట్టింటికి వచ్చిన అడబిడ్డలు తంగేడు పువ్వుల ముచ్చట్లు, గునుగు పులా మధ్య గౌరమ్మను పూజిస్తూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అనే జానపద పాటలతో మొదలైన సద్దుల బతుకమ్మ వేడుకలు పోయిరా బతుకమ్మ మళ్ళీ వచ్చే ఏడుకు మళ్ళీరా బతుకమ్మ అనే పాటతో గౌరమ్మను గంగా వాడికి చేర్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనిలలో మహిళలు బతుకమ్మ చుట్టూ వలయంల తిరుగుతూ రెండు చేతుల చప్పట్లతో ఉయ్యాల పాటలను పడుతుంటే మరోపక్క యువతులు డిజె పాటలకు స్టెప్పులు వేస్తూ బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులలో ముస్తాబై సంబురపడ్డారు. బతుకమ్మ పండుగ అంటే మహిళలు ఆడిపడే ఆటలకు వారి సంతోషానికి అవదులే ఉండవు అలాంటి పండుగ తెలంగాణలో ప్రకృతితో మమేకమై ఉండటం గొప్ప వేడుకగా ఈ బతుకమ్మ పండుగ.





**మహిళలకు బతుకమ్మ బహుమతులు**

ప్రకృతి ప్రసాదించిన పూల పండుగ బతుకమ్మ అని గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ అన్నారు. భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు బహుమతుల ప్రదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బతుకమ్మ ను అందంగా తీర్చిదిద్దిన మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం సాయిపేట శ్రీనివాస్ మాట్లాడుతూ తీరొక్క పూలతో ఆడబిడ్డలు సంబురంగా జరుపుకునే ఈ వేడుకకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బండారి హరిప్రసాద్, బండారి నరేష్, కావలి భాస్కర్, బండారి వెంకటేష్, బండారి అనిల్, నాట్రాజ్, సన్ రాజ్ నవీన్, సాయి, ఆనంద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగ సంబరాలు

**జయభేరి, దేవరకొండ :**



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా 8వ రోజు శ్రీ వాసవి మాత కనకదుర్గ అలంకారంతో ను శ్రీ రాజరాజేశ్వరి మాత బాలత్రిపుర సుందరి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం వాసవి మాత కు అభిషేకం సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. వాసవి మహిళలచే బతకమ్మ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బహుమతులను సాయి వెంకటేశ్వర ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ హైదరాబాద్ రాచమల్ల వెంకటేశ్వర్లు, వనం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు మొదటి బహుమతి గుంతోజు శేఖరా చారి రెండవ బహుమతి ఆలంపల్లి నరసింహ పార్లతమ్మ మూడో బహుమతి నీలా చంద్రశేఖర్ శ్వేత కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చేదెళ్ల వెంకటేశ్వర్లు కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ కోశాధికారి కొత్త సుబ్బారావు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రచార కమిటీ చైర్మన్ రాచమల్ల వెంకటేశ్వర్లు వాసవి కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షులు వనపర్తి మురళి స్వర్ణ రథం నిర్మాణ కమిటీ సభ్యులు వనం వెంకటేశ్వర్లు కర్నాటి పురుషోత్తం ఆర్యవైశ్య సంఘం సభ్యులు సముద్రాల సహదేవ్ సముద్రాల చంద్రశేఖర్ బికుమాళ్ళ లక్ష్మీనారాయణ వాసవి మహిళా సభ్యులు రాచమల్ల గీత చందా ఇందిరా చీదెళ్ళ శ్రీదేవి షీలా ధనలక్ష్మి కర్నాటి శాంత కుమారి కుంచకూరి సంధ్య గోవిందు తులసి దాచేపల్లి కల్పన దాచేపల్లి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో పూజలు

**జయభేరి, చందంపేట :**



చందంపేట మండల కేంద్రములో దసరా నవరాత్రి ఉత్సవాలను దుర్గా మాత కమిటీ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహిస్తున్నామని దుర్గాదేవి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయదశమికి ముందు నవరాత్రుల్లో తొమ్మిది రోజుల్లో అమ్మవారిని తొమ్మిది రూపాల్లో పూజిస్తామని,ప్రతి అవతారానికీ ఒక అర్థం ఉందని తెలిపారు .ప్రతిదేవి పూజ వెనుక ఆధ్యాత్మిక విశిష్టత ఉందని అన్నారు. భక్తి శ్రద్ధలతో దుర్గామాత మాలలు ధరించి ప్రతి రోజు తెల్లవారు జామునే నిద్రలేచి గ్రామం లోని దేవాలయాల్లో దుర్గామాతను పూజలు నిర్వహిస్తునమని అన్నారు. ప్రతి రోజు రాత్రి భక్తులు దుర్గామాతకు పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టి, బతుకమ్మా, భజనలతో సందడి వాతావరణం నెలకొందని అన్నారు. ఆలయాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో నిర్వాహకులు అలంకరించామని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ సలహాదారులు గోసుల అనంతగిరి, ఇరగ దింద్ల శ్రీశైలం, జగదీష్, యుగంధర్, వాసుదేవులు, శ్రీశైలం, నరసింహ, శ్రీశైలం, ఎల్లయ్య, సోమోజీ, బాను, ఎడ్ల గిరి, గౌతమ్, కుమార్, సతీష్, సాయికుమార్, నాగేష్,హరీష్, చందు, అంజి తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ సంబురాలు

**జయభేరి, మేడిపల్లి :**



మేడిపల్లి మండల వీరాంజనేయ స్వామి ఆలయం లో దేవి నవరాత్రి ఉత్సవాల లో భాగంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు హాజరై అమ్మవారిని దర్శించుకున్న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ సంబురాల్లో మేయర్, డిప్యూటీ మేయర్, మహిళతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆడపడుచులు అందరికీ మేయర్ అమర్ సింగ్ గారు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, మేడిపల్లి సిఐ గోవింద్ రెడ్డి, కార్పొరేటర్లు పిట్టల మల్లేష్, పాశం శశిరేఖ బుచ్చి యాదవ్, సీనియర్ నాయకులు పప్పుల అంజి రెడ్డి, చింతల నరసింహారెడ్డి, తవిటి ప్రశాంత్ వీరాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.




## సీడ్ బాల్స్ ప్రోగ్రామ్

**జయభేరి, దేవరకొండ :**

వాసవి వనిత క్లబ్ దేవరకొండ గ్రేటర్ వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ ఆదేశాల మేరకు సీడ్ బాల్స్ చేయాలని గవర్నర్ రాచెర్ల కమలాకర్ సలహాలు సూచనల మేరకు దేవరకొండ డైనమిక్ లేడీ ప్రెసి డెంట్ తణుకునూరు విజయ ఆధ్వర్యములో ఐ పి యు గోవిందు కొండయ్య సలహాలతో ఈ సీడ్ బాల్స్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. తయారు చేసిన తరువాత గుట్టల ప్రాంతాలలో కూడా వుండాలని గుట్టలలో వేయడం జరిగింది. కార్యక్రమములో పిరమిడ్ అధ్యక్షులు పద్మ మేడం మానస్ మోర్కాభ వాసవీ క్లబ్ జోన్ చైర్మన్లు డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు, RS, REC లు అన్ని క్లబ్బులు సెక్రటరీ, కోశాధి కారులు, ఇతర వాసవీ క్లబ్ సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు ఉత్సహముగా పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసారు, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొణుకునూరు విజయ వాసవి క్లబ్ కు చేసే సేవలు మరువలేనివని తెలియజేసినారు. అందరికి దేవరకొండ వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు లేడి డైనమిక్ తొనుకునూరు విజయ వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేసినారు.








## పారితోషికం తగ్గించిన భామ..

మంగళూరు భామ పూజా హెగ్డే ఇటీవలకాలంలో రేసులో కాస్త వెనకబడింది. వరుస ఫ్లాపులు ఆమెను నిరుత్సాహానికి గురిచేశాయి. అయినా ఏమాత్రం అధైర్యపడకుండా కెరీర్‌లో భారీ విజయం కోసం ప్రయత్నాలు చేస్తున్నది. తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ చిత్రంలో ఈ భామ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.. ఈ సినిమా తన కెరీర్‌ను మలుపుతిప్పుతుందనే ఆశాభావంతో ఉంది పూజాహెగ్డే. గతంలో భారీ పారితోషికాన్ని డిమాండ్ చేసే ఆమె ప్రస్తుతం పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నదట. దళపతి విజయ్ సినిమాకు తక్కువ పారితోషికం తీసుకుందని తెలిపింది. ప్రస్తుతం పూజాహెగ్డేకు తమిళం, హిందీల్లో అవకాశాలు బాగానే వస్తున్నా.. తెలుగులో మాత్రం ఇప్పటివరకు కొత్త సినిమా సైన్ చేయలేదు. తమిళంలో సూర్య 44 చిత్రంలో కూడా ఈ భామనే కథానాయికగా ఖరారైంది. ఈ రెండు చిత్రాలు తనకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తాయని, తెలుగులో కూడా త్వరలో మంచి అవకాశాలు వరిస్తాయని నమ్మకంతో ఉంది పూజాహెగ్డే.



## విమర్శలే మేలు చేశాయి..

కెరీర్ ఆరంభంలో తాను ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నానని, అయితే వాటిని పాజిటివ్‌గా తీసుకోవడం వల్ల నటిగా రాణించగలిగానని చెప్పింది అగ్ర కథానాయిక దీపికా పడుకోన్. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్ తొలినాటి సంగతుల్ని పంచుకుంది. ఆమె మాట్లాడుతూ 'బాలీవుడ్‌లో నా తొలి చిత్రం 'ఓం శాంతి ఓం' రిలీజ్ అయినప్పుడు సినిమా సమీక్షల్లో నాపై తీవ్రంగా విమర్శలు చేశారు. నాకు హిందీ డబ్బింగ్ చెప్పిన వాయిస్‌తో నా లుక్స్‌కు ఏమాత్రం సరిపోలేదని విమర్శించారు. నేను డైలాగ్స్ చెప్పిన విధానం కూడా బాగాలేదన్నారు. అయితే వాటిని చూసి ఏ మాత్రం కుంగిపోలేదు. నన్ను నేను మార్చుకోవడానికి ఆ రివ్యూలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మరోసారి తప్పు జరగొద్దని నాలో సంకల్పాన్ని పెంచాయి. అప్పటి సమీక్షలే నన్ను మార్చివేశాయి. ఒక్కోసారి విమర్శలే మనకు మేలు చేస్తాయి. వాటిని హుందాగా స్వీకరించాలి' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో భారీ సినిమాలతో బిజీగా ఉంది. దీపికా పడుకోన్ కథానాయికగా నటించిన 'సింగమ్ అగైన్' నవంబర్ 1న విడుదల కానుంది.



## రతన్ టాటా లెజెండరీ ఐకాన్.. ప్రతి క్షణాన్ని గుర్తుంచుకుంటా : రజినీకాంత్

రతన్ టాటా మరణంపై స్టార్ నటుడు రజినీకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన విజన్, అభిరుచితో భారతదేశాన్ని ప్రపంచ వేదికపై నిలిపిన గొప్ప లెజెండరీ ఐకాన్ రతన్ టాటా అని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'తన విజన్, అభిరుచితో భారతదేశాన్ని ప్రపంచ వేదికపై నిలిపిన గొప్ప లెజెండరీ ఐకాన్ రతన్ టాటా. వేలాది మంది పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తి. ఎన్నో తరాలుగా లక్షలాది ఉద్యోగాలు సృష్టించిన వ్యక్తి. అందరి నుంచి ప్రేమ, అభిమానం, గౌరవం పొందిన వ్యక్తి. ఆయనతో గడిపిన ప్రతి క్షణాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా. ఆయనకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా' అని పేర్కొన్నారు.

## ప్రభాస్ సినిమాలో విలన్‌గా గోపీచంద్ కన్‌ఫర్మ్!

కథానాయకులు ప్రభాస్, గోపీచంద్‌ల స్నేహబంధం గురించి అందరికి తెలిసిందే. ముఖ్యంగా గోపీచంద్‌కు, ఆయన కెరీర్‌కు ప్రభాస్ ఎప్పుడు తన వంతు సహకారం అందిస్తుంటాడు. ప్రస్తుతం గోపీచంద్ విశ్వం అనే సినిమాలో నటించాడు. కావ్యథాపర్ హీరోయిన్‌గా శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. పీపుల్‌స్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కాగా ఈ చిత్రం ప్రమోషన్స్‌లో పాల్గొన్న గోపీచంద్‌కు.. 'మళ్లీ మీరు విలన్‌గా నటించే అవకాశం వుందా?' అని అడిగితే.. హీరోగా చాలా కంఫర్‌ట్‌గా వున్నానని ఇప్పట్లో అలాంటి వుద్దేశం లేదని చెప్పాడు, అయితే 'ఒకవేళ మీ స్నేహితుడు ప్రభాస్ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ పాత్ర వస్తే చేస్తారా' అన్నప్పుడు మాత్రం తప్పకుండా చేస్తాను. అలాంటి కథ కోసం మేమిద్దరం ఎదురుచూస్తున్నాం అని సమాధానమిచ్చాడు గోపీచంద్. కాగా ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్‌తో పాటు హను రాఘవపూడి చిత్రంలో ఫౌజీ అనే వర్కింగ్ టైటల్‌తో రూపొందుతున్న ఓ చిత్రంలో నటిస్తున్నాడు. ఇటీవల ఈ చిత్రం ఓ షెడ్యూల్‌ను కూడా పూర్తిచేసుకుంది. ఈ చిత్రంలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడిగా కనిపిస్తాడు. అయితే ఈ చిత్రంలో ఓ నెగెటివ్ రోల్‌కు గోపీచంద్‌ను అనుకున్నాడట దర్శకుడు. ఇటీవల గోపీచంద్‌కు హను రాఘవపూడి ఆ కథను కూడా నెరేషన్ ఇచ్చేశాడట. అయితే ఇంకా గోపీ నుంచి పూర్తి గ్రీన్‌సిగ్నల్ రాలేదని తెలిసింది. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నని, రవిశంకర్ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంతకు ముందు గోపీచంద్ తేజ దర్శకత్వంలో తెరకెక్కిన జయం, నిజం సినిమాలతో పాటు ప్రభాస్ హీరోగా తెరకెక్కిన వర్షం చిత్రాల్లో కూడా ప్రతినాయకుడిగా కనిపించిన సంగతి తెలిసిందే.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com